
సిటీలో ముఖ్యమైన సెంటర్లో ఆధునికంగా నిర్మించిన అతి పెద్ద డిపార్ట్‌మెంటల్ స్టోర్స్ అది. క్యాష్ కౌంటర్లో కూర్చుని కస్టమర్స్ తీసుకున్న వస్తువులకి యాడింగ్ మెషీన్ మీద బిల్లులు తయారు చేస్తున్నాడు

బ్రౌన్ కలర్ షర్ట్ వేసుకున్న ఓ యువకుడు.




దివ్య ఆ కౌంటర్ దగ్గరకు రాగానే ... ఆమె కోసమే ఎదురుచూస్తున్న వాడిలా "నమస్తే..." అంటూ "నిన్న సాయంత్రం రామాలయంలో మీరు పాడిన త్యాగరాయ కృతులు విన్నాను. చాలా బాగా పాడారు. రియల్లీ మాగ్నిఫిసెంట్" మెల్లిగా ఆమెతో చెప్పాడా యువకుడు. అప్పుడు చూసింది దివ్య అతని వంక కాస్త పరిశీలనగా.

అప్పుడే కొన్న కొత్త జాన్సన్స్ బేబీ పౌడర్ టిన్‌లా ఫ్రెష్‌గా వున్నాడతడు. ఎదుటి వ్యక్తి ఆలోచనలు చదివేస్తున్నట్లుగా ... ఇంటెలిజెంట్‌గా మెరుస్తున్న కళ్ళు! సిస్టమాటిక్‌గా ట్రిమ్ చేసిన వొత్తయిన నల్లటి మీసాలు.

అభినందన నిండిన అతడి కళ్ళల్లోకి ఒకే ఒక్క క్షణం చూసి చిర్నవ్వు నవ్విందామె. 'థాంక్స్' అందామనుకుంది గానీ పెదాలెందుకో తెరుచుకోలేదు. ఆమె గుండె వేగంగా కొట్టుకుంటోంది చిత్రంగా.

డబ్బు చెల్లించి రిక్షాలో ఇంటి కొస్తుంటే రోడ్‌కి ఓ ప్రక్కన ఆప్టానికా టీ.వీ. వాళ్ళ అడ్వర్‌టైజ్‌మెంట్ హోర్డింగ్ కనిపించిందామెకు. దాని మీదున్న అక్షరాల్ని చదవగానే సన్నటి నవ్వు ఆమె పెదాల మీద మెరిసింది.

**LOVE AT FIRST SIGHT**

* * *

ఇంటికొచ్చాక కూడా అతన్ని గురించిన ఆలోచనలు మనసు నుండి చెరగలేదు దివ్యకు. అది ఆమెకు చాలా ఆశ్చర్యంగా వుంది. ఎందుకంటే ఇంత వరకూ ఏనాడూ ఏ అబ్బాయిని గురించీ అంతగా ఆలోచించలేదామె. అలా ఆలోచించే అర్హత కూడా తనకు లేదని ఆమె నమ్మకం! ఏ అందచందాలూ తనలో లేవనీ, తను నల్లగా వికారంగా వుంటుందనీ ఆమెకు బాగా తెలుసు. తనను చూసి ఏ మగాడూ ఆకర్షించబడడనీ, ఎవరూ ప్రేమించరనీ ... ఓ రకమైన ఇన్ఫీరియారిటీ కాంప్లెక్స్ ఆమెలో బాగా నాటుకుపోయింది. దురదృష్టకరమైన సంగతేమిటంటే ఆమెలో ఆ కాంప్లెక్స్ అంతగా ప్రబలిపోవడానికి ఆమె తల్లి తండ్రుల ప్రవర్తన కూడా పరోక్షంగా ఓ బలమైన కారణం కావడం! దివ్య కంటే మూడేళ్ళు చిన్నదైన ఆమె చెల్లెలు తుషార, అద్భుత సౌందర్యరాశిగా పుట్టడంతో... తల్లి తండ్రులెప్పుడూ తుషారనే అతిగా ముద్దు చేస్తూ, దివ్యను "నిర్లక్ష్యం" చేసేవారు. ఆ 'తేడా'ని చాలా లేత వయసులోనే దివ్య స్పష్టంగా గుర్తించగలిగింది. తను నల్లగా అంద వికారంగా వుంటుందనే కాంప్లెక్స్ ఆమెలో ఎంతగా ఎదిగిందంటే ... అస

# ప్రేమ

గుమ్మడి రవీంద్రనాథ్



లామెకు ఈ ప్రాపంచిక విషయాల మీద ఆశగానీ ధ్యాసగానీ వుండేది కాదంతగా. సంగీతం అంటే ప్రాణం. పాటే ఆమె ప్రియమైన నేస్తం! అందమైన దానిగా ఆమెను పుట్టించనందుకు, ప్రాయశ్చిత్తంగానేమో మరి ... భగవంతుడామెకు మధురమైన కంఠస్వరాన్ని ప్రసాదించాడు. వసంత మాసపు మామిడి పూతల్ని మేసి మత్తుగా పాడే కోయిల కూతల్లో కూడా ఆ మాధుర్యం వుండదేమో. అంత కమ్మటి గొంతామెది. లౌకికమైన ఆశలూ కోరికలూ ... అన్నీ అణచి వేసుకుని... నిరాశలోనే 'తృప్తి'ని వెదుక్కుంటూ కాలం గడుపుతున్న దివ్యకు చాలా ఆశ్చర్యంగానూ వింతగానే వుంది. ఓ వ్యక్తి తొలి చూపులోనే తన ఆలోచనల్లో ఇంతగా చోటు చేసుకోవడం అనేది!! ఏదో ఒక వంకతో మళ్ళీ ఆ డిపార్ట్‌మెంటల్ స్టోర్స్‌కి వెళ్ళి అతడ్ని చూడాలి అనే నిర్ణయానికొచ్చాక గానీ ... ఆమెకా రాత్రి నిద్ర పట్టలేదు!!

* * *



"ఎం.ఎ. గోల్డ్ మెడలిస్ట్ అయ్యుండీ డిపార్ట్‌మెంటల్ స్టోర్స్‌లో ఆ చిన్ని ఉద్యోగమా ... ఇంకేదైనా బెటర్ జాబ్ కోసం..."

"ప్రయత్నిస్తున్నానండీ ఈ మధ్యనే ఓ బ్యాంక్ ఉద్యోగానికి ఇంటర్వ్యూ కెళ్ళొచ్చాను!"

"మ్యూజిక్ తెలుసా మీకు?"

"ఊహూ. కానీ సంగీతమంటే ఇష్టం. పొగుడుతున్నానని అనుకోవద్దూ, మీ స్వరం నిజంగా అద్భుతంగా వుంటుందండీ. మీ గొంతు వింటుంటే ... వెన్నెల రాత్రి మేఘాల పరుపుల మీద సన్న జాజుల దిండేసుకుని అమృతం సేవిస్తూ అలా... అలా అలలా తేలిపోతూ గగన విహారం చేస్తున్న అనుభూతి! ఇటీజ్ సో మెల్లి ఫ్లూయస్ అండ్ అవుట్‌స్టాండింగ్లీ గుడ్!"

"......"

"రేడియోలో పాడారా ఎప్పుడైనా?"

"ఊ!"

"ఎప్పుడు?"

"చాలాసార్లు"

"ఈసారి రేడియోలో మీ ప్రోగ్రామేదైనా వుంటే నాకు తప్పకుండా చెప్పాలి. అయ్ జస్ట్ కెనాట్ ఎఫర్డ్ టు మిస్ ఇట్ దిస్ టైమ్."

"అలాగే"

"మీతో కలిసి ఇలా ఈ హోటల్లో కాఫీ తాగటం అనేది ఓ గొప్ప అనుభవంగా మిగిలి పోతుంది నా జీవితంలో"

* * *

సైగల్ పాటా, శరత్ నవలా, కీట్స్ పొయట్రీ, సంగీతం ... జీవితంలో ఇవి తప్ప ఇంకేమీ లేదనుకునే దివ్య మనసులోకి 'నేనూ వున్నాను' అంటూ ప్రవేశించి చాలా కొద్ది రోజుల్లోనే ఆ మనసునంతా ఆక్రమించేసుకుని తన 'సొంతం' చేసేసుకున్నాడతడు. వికాస్ (అతని పేరదే) అన్న మూడక్షరాలే ఆమెకు వేద మంత్రాక్షరాలయ్యాయి. లోకమంతా వికాస్! తను వికాస్‌ని ఇష్టపడుతున్నంతగా లోకంలో మరే అమ్మాయీ ఏ అబ్బాయినీ ఇష్టపడదు అనుకునేది. ఆ భావనే ఆమెకు ఎంతో సంతోషాన్నిచ్చేది.

* * *

సముద్ర కెరటాల మీదుగా వీస్తున్న సంధ్య గాలులు చల్లగా, సూథింగ్‌గా వున్నాయ్ ఆ బీచ్‌లో ... తడి ఇసుక మీద మెల్లిగా అడుగులు వేస్తూ ఊసులాడుకుంటున్నారు వాళ్ళు.

"వికాస్! డు యు రియల్లీ లవ్ మీ?"

అదేం పిచ్చి ప్రశ్న అన్నట్లుగా ఆమె వంక నోసారి చూశాడు. ఏం చెప్పలేదు.

"చెప్పు"

"మోర్ దేన్ మై లైఫ్! అసలు నేన్నిన్నెంతగా ప్రేమిస్తున్నానో చెప్పడానికి చాలినన్ని పదాలు ఏ భాషలోనూ ఇంకా పుట్టలేదు. అయ్ కెన్ నెవ్వర్ ఫైండ్ వర్డ్స్ ఇనఫ్ టు టెల్ యు హౌమచ్ అయ్ లవ్ యు... హౌమచ్ అయ్ వర్‌షిప్ యు. యు ఆర్ ది ఆపిల్ ఆఫ్ మై ఐ"

అతని మాటల్లోని ప్రతి అక్షరాన్నీ ఆమె హృదయం ఆస్వాదిస్తోంది. ఓ శీతల పవనం కడలి అలల మీదుగా వీచి ... ఆమెను మృదువుగా తాకింది.

"నేనసలు కల్లో కూడా ఊహించలేదెప్పుడూ నాలాంటి దానికి ఇంత చక్కటి వ్యక్తి ప్రేమ ప్రాప్తిస్తుందని. యు ఆర్ మై మిరకిల్. నేను అదృష్టవంతురాల్ని చాలా" మనస్ఫూర్తిగా చెప్పింది.

"నీకేం తక్కువని అలా అంటావ్. ఎన్ని కోట్ల వజ్ర వైఢూర్యాలైనా నీ పాటతో సమానం కాగలవా? అంత మధుర స్వరం ఈ లోకంలో ఎవ్వరికుంది? నువ్వు కాదు అసలు అదృష్టవంతురాలివి-నేను"

ఆమె వైపు నుండి నిశ్శబ్దం.

అతనే మళ్ళీ చెప్పాడు.

"నువ్వు కాస్త నలుపే అయినా ముఖంలో ఎంతో కళ వుంది తెలుసా? ఎక్స్‌క్విజిట్ ఫీచర్స్. నలుపనేది ఒక లోటని నువ్వనుకుంటే ఆ లోటుని నీ గొంతు థౌజండ్ టైమ్స్ కాంపెన్సేట్ చేస్తుంది"–చాలా నిజాయితీగా చెప్పాడు. నడుస్తున్నదల్లా ఓ చోట వంగి ఆ ఇసుక లోంచి ఒక సముద్రపు ఆల్చిప్ప తీసింది దివ్య. వికాస్ ఆగాడు. ఆ షెల్‌తో ఆ తడి ఇసుక మీద ఏదో బొమ్మని గీస్తోందామె. అది 'మనిషి కన్ను'. ఆ 'కన్ను' ప్రక్కనే, హృదయం ఆకారాన్ని గీసి అందులోంచి ఓ బాణం దూసుకు పోయినట్లుగా వేసింది. కుతూహలంతో చూస్తున్నాడు వికాస్. ఆ రెండో బొమ్మని గీశాక లేచి వికాస్ రెండు భుజాల్నీ పట్టుకుని అతన్ని మెల్లిగా నడిపిస్తూ ఆ రెండో బొమ్మ ప్రక్కన నిలబెట్టింది. ఆ రెండు బొమ్మల వంకా, వాటి ప్రక్కనే నిలబడ్డ వికాస్ వంకా అపురూపంగా చూసుకుంటోంది దివ్య.

'యస్... అయ్ లవ్ వికాస్' అనుకుంది మనసులో!

* * *

చెల్లెలు తుషార బెంగుళూరు నుండి వ్రాసిన ఉత్తరం పూర్తిగా చదివింది దివ్య. తుషార బెంగుళూర్లో మెడిసిన్ చదువుతోంది. సెమిస్టర్ బ్రేక్ హాలిడేస్‌కి, రేపే బయల్దేరి ఇంటి కొస్తున్నట్లు తెలియజేస్తూ వ్రాసిన ఉత్తరం అది. ఎందుకోగానీ ... చెల్లెలు ఇంటి కొస్తుందన్న వార్త దివ్యకు అశుభ సూచకంగా అన్పించింది. తన అదృష్టాన్ని ఎవరో గద్దలా తన్నుకోబోతున్నారనే ఓ రకమైన ప్రిమోనిషన్!! ఎందుకో మరి తెలీదు.

తుషారను చూస్తే వికాస్ ఎలా స్పందిస్తాడు? సౌందర్యానికి పెర్సానిఫికేషన్ లా వుండే తుషారను నాతో పోల్చుకుని ... నన్ను ప్రేమించినందుకు చింతిస్తాడా... నన్ను డెసెర్ట్ చేసేస్తాడా??

ఏదైనా అద్భుతం జరిగి తుషార ఇక్కడకు రాకుండా వుండాలి అని కోరుకుంది. కానీ ఆమె కోరుకున్నట్లుగా జరగలేదు.

* * *

"అమీర్ ఖాన్ సినిమా 'లవ్ లవ్ లవ్' వుంది

ఊళ్ళో. వెళ్దామా అక్కా ఈవేళ" తుషార చాలా హుషారుగా అడిగింది. తుషార వచ్చి అప్పటికి నాల్గు రోజులైంది. ఆ అమ్మాయికి హీరో అమీర్ ఖాన్ అంటే భలే క్రేజ్!

"నాకు తల నొప్పిగా వుంది, నేరాలేను. రేపు వెళ్దాంలే"

"అమీర్ ఖాన్ స్క్రీన్ మీద ప్రత్యక్షమవ్వగానే తల నొప్పి గిల్నొప్పి అన్నీ ఎగిరి పోతాయ్. బయల్దేరు వెళ్దాం - నా కోసం-ప్లీజక్కా" గెడ్డం పట్టుకుని చిన్న పిల్లలా బతిమిలాడేసరికి చెల్లెల్ని నిరుత్సాహ పర్చడం ఇష్టంలేక సరే అంది దివ్య.

* * *

వికాస్‌కి చెప్పకుండా సినిమాకి రావడం ఇదే మొదటి సారి.

థియేటర్లో కూర్చున్నాక అనుకుంది దివ్య. ఏ చిన్ని సంతోషమైనా, ఏ చిన్ని అనుభవమైనా అతన్తోనే కలిసి పంచుకోవాలి అనే కోరిక అంతరంగంలో గాఢంగా సెనవేసుకు పోవడం వల్లనేమో - అలా వికాస్‌కి తెలీకుండా సినిమా చూడడం అన్నది ఆమెలో ఓ రకమైన గిల్టీ ఫీలింగ్‌ని కలుగ చేస్తోంది.

ఇంటర్ వెల్‌లో అక్కా చెల్లెళ్ళిద్దరూ బయట థమ్స్ అప్ తాగుతుండగా "హాయ్ దివ్యా" అంటూ వికాస్ వాళ్ళ ముందు ప్రత్యక్షమయ్యే సరికి దివ్యకదొక చిన్న షాక్‌లా అనిపించింది. తనెలా వచ్చాడిక్కడికి? "వాటె సర్‌ప్రైజ్" అంది దివ్య! తన ప్రక్కనున్న తుషారను చూశాక వికాస్ ముఖంలో ఎక్స్‌ప్రెషన్స్ ఏమైనా మారుతున్నాయేమోనన్నట్లుగా నిశితంగా చూసింది.

"ఇదిగో వీడి పోరు పడలేక స్టోర్స్ క్కూడా ఎగనామం పెట్టి ఈ సినిమాకి వచ్చాను"-ప్రక్కనున్న మిత్రుడి వైపు చూపిస్తూ చెబుతున్నాడు వికాస్.

"నా సిస్టర్ తుషార అని చెప్పానే, ఇదే" పరిచయం చేసింది. "హలో" అన్నాడు వికాస్ తుషారతో. అంతే. అంత స్టన్నింగ్ బ్యూటీని చూసి కూడా అతని ముఖంలో ... దివ్య ఊహించినట్లుగా ఎలాంటి మార్పూ లేదు.

"ఇతను వికాస్. నా ఫ్రెండ్" చెల్లెలుతో చెప్పింది దివ్య.

* * *

" 'వికాస్' - పేరు బాగుంది. నేమ్‌లో ఏముందిలే గానీ... చాలా బాగున్నాడు. మీసాలు తీసేస్తే అమీర్ ఖాన్ కన్నా బాగుంటాడు. నీ కింత గ్లామరస్ బోయ్ ఫ్రెండున్నాడని ఎప్పుడూ చిన్న హింటైనా ఇవ్వలేదేమే అక్కా?" సినిమా అయ్యాక ఇంటికి రిక్షాలో వెళ్తూ దార్లో అడిగింది.


చిన్న గా నవ్వి మౌనంగా వుండి పోయింది దివ్య. ఏం మాట్లాడలేదు.

"ఒట్టి ఫ్రెండేనా... లే...క... మోర్‌దేన్ దట్టా?" క్రిప్టిక్‌గా నవ్వుతూ అక్కను ఏడిపించింది తుషార.

'ఫ్రెండ్ కాదు. నా ప్రాణం ... నా సర్వస్వం' మనసులోనే అనుకుంది దివ్య.

* * *

దాదాపు పరుగెత్తుతున్నంత వేగంగా నడుస్తోంది




దివ్య. తన ఆనందాన్ని వికాస్‌తో పంచుకోవాలి. "టు డబుల్ యువర్ జాయ్, డివైడ్ ఇట్ విత్ సమ్‌వన్" ఏదో వాల్ పెయింటింగ్ మీద ఎక్కడో చదివిన వాక్యం గుర్తొస్తోంది. అప్పటికి వికాస్‌ని చూసీ, అతని మాటలు విని ఐదు రోజులౌతోంది. ఎక్కడికెళ్ళాడో తెలీదు. డిపార్ట్‌మెంటల్ స్టోర్స్‌కి రోజూ ఫోన్ చేస్తూనే వుంది. "రాలేదు. లీవ్‌కూడా అప్లై చేయలేదు" అన్న సమాధానం అక్కడ్నుండి. అతన్ని ఐదు రోజులుగా చూడకపోవడం వల్ల కలిగిన బాధను కూడా మరపింప చేసేంత ఆనందం ఆమె మనసునూపేస్తోందా క్షణం వికాస్ రూమ్ సమీపించే కొద్దీ! అతన్ని చూడబోతున్నానన్న ఫీవరిష్ ఎగ్జైట్‌మెంట్ ఆమె అడుగుల్ని తడబెడ్తోంది. 'ఇవాళ అతనికో సర్‌ప్రైజ్ నేనిలా రావడం!' అనుకుంటూ నడవసాగింది. ఆమె ఆనందానికి కారణం ఆ రోజు వచ్చిన ఓ ఫోన్ కాల్!

"ఈజిట్ మిస్ దివ్యా?" ఫోన్లో ఎవరిదో గొంతు.

"యస్. దివ్యనే. మీరెవరు?"

"మద్రాసు నుండి మాట్లాడుతున్నాం. సంగీత దర్శకులు ఇళయరాజాగారు మీతో మాట్లాడాలను కుంటున్నారు. ఒన్ సెకండ్ ప్లీజ్" కొన్ని క్షణాలు ఊపిరి పీల్చడం మర్చిపోయింది దివ్య. దక్షిణ భారత దేశంలోనే ఎంతో పేరు ప్రఖ్యాతులున్న గొప్ప సినీ సంగీత దర్శకులు తనతో ఫోన్లో మాట్లాడబోతున్నారు! క్షణం తర్వాత ఆయనే లైన్లోకొచ్చారు.

"నిన్న రాత్రి రేడియోలో మీ పాట విన్నాను. నేను ఎంతోకాలంనుండీ ఎదురు చూస్తున్న ఓ యునిక్ వాయిస్ అదే అన్పించింది. మీ కభ్యంతరం లేకపోతే... నేను మిమ్మల్ని సినిమా పాటలకి ఇంట్రడ్యూస్ చేస్తాను..."

ఈ సంగతి తెల్సి వికాస్ ఎంతగానో సంతోషిస్తాడు అన్న ఆలోచనే ఆమెకు ఎక్కువ సంతోషాన్నిస్తోంది. హమ్మయ్య రూమ్ బయట బైక్ వుంది.

'తలుపు తీయగానే వికాస్ ఎంతో ఆశ్చర్యపడతాడో! ఓ నిమిషం ఆగింది. లోపల్నుండి గుసగుసగా మాటలు వినిపించాయి. ఎవరిదో బాగా తెలిసిన వారిదిలా వుందా గొంతు.

తుషార! అవును తుషారదే ఆ గొంతు. ఈ సమయంలో ఇక్కడేం చేస్తూందది? అసలెలా వొచ్చిం దిక్కడికి? ఒకవేళ తుషారే అయినా తలుపు వేసుకో వలసిన అవసరం ఏముంది?

"అరే వొదలండి...కొత్త శ్లైజు చిరుగుతుంది."

"......"

"చూడ్డానికి పాపాయిలా అమాయకంగా వుంటారు గానీ మీరు భలే రొమాంటిక్."

"ఈ మాత్రానికే రొమాంటిక్ అంటూ అంత పెద్ద సర్టిఫికెటా? ఇట్స్ వోన్లీ బిగినింగ్ బేబీ. అసలు సిసలు రసోత్సవం ముందు ముందుంది. అప్పుడిక ఆస్కార్ అవార్డ్‌లే ఇస్తావేమో!"

"అవునూ మా అక్కతో మరీ ఇదిగా వుంటున్నావ్ ఏంటి కథ?"

"కథలేదూ స్క్రీన్ ప్లేమా లేదు. అయినా ఇప్పుడా అవతారాన్ని గుర్తుచేసి నా ఖరాజల్ అణిచేయకు. ఏవైనా అందమైన ఎగ్జైటింగ్ విషయాలు చెప్పు."

స్పష్టంగా విన్పించాయి దివ్యకామాటలు.

ఎర్రగా కాల్చిన సిడిబాకు గుండెల్లోంచి ఎవరో కస్సున దింపేసిన బాధ. తాను నిల్చున్న చోట నేల చీలిపోయి తన్నెందుకు సమాధి చేయదూ? ఆకాశం కూలిపోదేం?

దబదబా తలుపు మీద బాది, వాళ్ళిద్దరి పాపాన్ని కళ్ళారా చూసి, వికాస్ ముఖం మీద ఉమ్మి వేయా లన్నంత ఉక్రోషం.

హ్యూమన్ డిగ్నిటీని ఎవరో కోల్డ్‌బ్లడెడ్‌గా హత మార్చుతున్న భావం. అంత ఆవేశంలోనూ తలుపు బాదడానికి ఆమె సంస్కారం అడ్డు పడింది. సభ్యత ! డామ్ ఇట్!

వెనక్కి అడుగు వేసింది దివ్య. ఆ సమయంలో తలుపు తట్టి రచ్చచేయడం మానర్‌లెస్ అన్న ఆలోచనని లెక్కచేయకుండా తలుపు తెరిచేవరకూ తట్టి వుంటే ఈ కథకి ముగింపు మరోలా వుండేదేమో బహుశ.

* * *

వికాస్

ఆ పేరు తలచినంతనే గుండె ఎక్వేరియంలో గోల్డ్ ఫిష్‌లా కదిలే ఆ అపురూపమైన 'అనుభూతి అలజడి' ఇప్పుడేది? వికాస్ కేవలం తన ఒక్కదానికే సొంతం అనీ, అతని కనుచూపుల వెన్నెలలు పలికే లిపిలేని మౌన గీతాలకీ, అతని కౌగిలి వీణలు వినిపించే రాగ సుధలకీ...వివశురాలినైపోతూ జీవితమంతా చైత్రాలేననీ, శిశిరం తనదరికే రాదనీ ఎన్ని మధురోహలు? పొగ మంచులో రాలే పొగడపూలకి కొత్త అందాలు సంతరిస్తూ, గులాబీల ఘుమ ఘుమలకి కొత్త పరిమళాల్నద్దుతూ జీవన మాధుర్యాన్ని నాలుక అంచుమీద నిలిపే వికాస్ గురించి ఎన్ని కలలు? ఇప్పుడేవీ ఆ కలల జాడలు?

తలగడలో దాచుకున్న ముఖం ఎర్ర(?)గా

